# ప్రయోగం

"ఏంటి మధూ! ఈమధ్య మరీ అంత డల్‌గా ఉంటున్నావ్" అడిగింది హేమ.

"ఏంలేదు...ఈ మధ్య జీవితం కొంచెం నొప్పిగా, భారంగా ఉందిలే" చెప్పాడు మధు ఈజీ చైర్‌లో కాస్త వెనగ్గా జారబడుతూ.

"ఏదో తలనెప్పిగా ఉందన్నంత ఈజీగా చెప్పావ్. అదీకాక కొత్తగా పెళ్ళి కూడా చేసుకున్నావ్. లైఫ్ ఎంజాయ్ చేస్తున్నావనుకుంటున్నానే"

"ఎంజాయా గంజాయా? ఉడత చేతిలో జాంకాయ్‌లా తయ్యారైంది నా పరిస్థితి నా శ్రీమతి దయవల్ల!"

"ఏం? నీ మిసెస్ మరీ సీరియస్ పర్సనా?"



-వడ్లమన్నాటి గంగాధర్

"కాదు! సీరియల్స్ పర్సన్!"

"అంటే?"

"అంటే..ఏముంది. నేను ఇంటికెళ్లగానే ఏదో ఒక సీరియల్ చూస్తూ కూర్చుంటుంది. నేను ఏది అడిగినా పట్టించుకోదు. తొంభై తొమ్మిది సార్లు గొంతు చించుకు చెబితే, అప్పుడు ఆ పనిని మొక్కుబడిగా చేయడమో లేక నాకు మొక్కుబడిగా సమాధానమివ్వడమో చేసి, మళ్లీ టీ.వి. సీరియల్‌లో లీనమైపోతుంది. నేను ఒక దాని గురించి అడిగితే, తను మరో సీరియల్ గురించి మాట్లాడుతుంది. అలాగే మొన్నటిరోజు నేను తనని పొగుడుతూ ఈ చీరలో భలే ముద్దొస్తున్నావ్ అన్నాను. ఆ మాటకి ఆమె 'అరే! శేఖర్ కూడా ఇదే మాటన్నాడే' అని చెప్పింది. 'శేఖరా? శేఖరేవడే' అడిగాన్నేను ఆతృతగా. అదేనండీ! వేయి జన్మల డైలీ సీరియల్ హీరో అని ఆమె చెప్పగానే నాకు మూడ్‌పోయి మూడం మొదలైంది. అలాగే ఇంకొన్నిసార్లు నేనామెతో ప్రేమగా మాట్లాడడానికి ప్రయత్నించినపుడు, సీరియల్‌లో వచ్చే సంభాషణలతో నా మాటలు పోల్చి నన్ను మూడౌట్ చేస్తుంది. ఇలా అప్పుడు, ఇప్పుడు అని లేకుండా ఎప్పుడూ ఆ సీరియల్స్ అనే ప్రపంచంలోనే విహరిస్తోందంటే నమ్ము"

"అలాగా! అయితే ఇలాంటప్పుడే ఆమెకి డైవర్షన్ కావాలి. కాబట్టి ఆవిడకి ఈ సీరియల్స్ తప్పితే ఇంకేం ఇష్టమో చెప్పు?"

"వంటలు.. సీరియల్స్ లేనప్పుడు... అంటే శని, ఆదివారాల్లో రకరకాల వంటలు చేసి నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. కనుక నాకప్పుడప్పుడూ అనిపిస్తుంది రోజూ ఏ శనివారమో, ఆదివారమో అయితే బావుండునని!" చెప్పాడు ముఖంలో కాసింత ఆశావాదాన్ని కనబరుస్తూ.

దాంతో హేమ ఏదో ఆలోచన తట్టినట్టుగా "అలా అయితే నీ ప్రాబ్లంని ఈజీగా సాల్వ్ చేయొచ్చు" చెప్పిందామె నమ్మకంగా.

"అదెలా?" అడిగాడు మధు ఆశ్చర్యంగా.

"ఏముంది. ఆమె ఇంట్రెస్ట్‌ని సీరియల్స్ నుండి వంటలవైపుకి డైవర్ట్ చేస్తే సరి!"

"అదేలా సాధ్యం?"

"ఏముంది ఆమెకి సీరియల్స్‌పై ఇంట్రెస్ట్ అనే చిన్న గీత పక్కన వంటలపైగల ఇంట్రెస్ట్ అనే పెద్ద గీత గీస్తే సరి. ఎలా అంటే, ఆమెకి వంటలపై గల ఇంట్రెస్ట్‌ని మనమే పెంచాలి. ఎట్లా అంటే ఆమెకి కొత్తవంటల పుస్తకాలు కొనివ్వడం, ఇతర దేశాల వంటల సీడీలు కొనివ్వడం, ఆమె చేసే వంటలని పొగుడుతూ అది చేసి పెట్టు, ఇది చేసి పెట్టు అంటూ ఆమెని పొంగిస్తే సరి. అప్పుడు సీరియల్స్‌పైగల ఇంట్రెస్ట్ డైవర్ట్ అవుతుంది. నీ ప్రాబ్లం తప్పక సాల్వ్ అవుతుంది. కాబట్టి ఈ నా ప్లాన్‌ని అమల్లో పెట్టు..రిజల్ట్ ఏమైందో ఓ వారం తర్వాత వచ్చి తెలుసుకుంటాను. ఎందుకంటే నేను ఓ వారంపాటు లీవ్ పెట్టాను. సో.. బెస్ట్ ఆఫ్ లక్" చెప్పి అక్కడ్నుంచి కదిలింది హేమ.

ఆ ప్లాన్ మధుకు నచ్చడంతో దానిని మర్నాటి నుండే అమల్లో పెట్టాడు.

***

వారం తర్వాత మళ్ళీ హేమ వచ్చి "హాయ్ మధూ! నే చెప్పిన డైవర్షన్ ప్లాన్ ఎలా పనిచేసింది" అడిగింది హేమ కళ్ళల్లో ఆసక్తిని కనబరుస్తూ.

"ఎలా పనిచేసిందా? నన్ను పెనంలోంచి పొయ్యిలో పడేసింది".

"అదెట్లా మధూ?"

"ఎలాగా! ఇదివరకు నాకు పరోక్షంగానే ఇచ్చింది. కానీ ఇప్పుడు తన కొత్త తరహా మళయాళ, అరవ, హిందీ, గుజరాతీ, మరాఠీ టైపు వంటలతో ప్రయోగాలు చేస్తోంది. ఏదో కొత్తగా కనిపెట్టిన మందులని ముందుగా ఎలుకలమీద, కోతులమీద ప్రయోగించినట్టు- తన వంటలని నామీదే ముందుగా పరీక్షించి వాటి గుణగణాలు తెలుస్తోంది. అసలు నా శ్రీమతి చేసే ఈ చిత్ర విచిత్ర, కొత్త చెత్త వంట ప్రయోగాలు భరించడం కంటే, ఆమెకి ఇదివరకు ఉన్న సీరియల్స్ పిచ్చే నయమనిపిస్తోంది" చెప్పాడు మళ్ళీ కుర్చీలో విసుగ్గా వెనక్కి జారబడుతూ.

★